క్లుప్తంగా

నేటి నుంచి మల్లన్న ఆలయంలో ఉత్సవాలు


మల్లన్న దేవాలయం

మణికొండ: ప్రతి ఏడాది నిర్వహించే మణికొండ మల్లన్న కల్యాణం, బోనాల ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం 5 గంటలకు గంగకు వెళ్లడం, రాత్రి 9.30 గంటలకు మల్లన్న ఒగ్గు కథలు వంటి పలు కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు బి.ముత్యాలు, ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మణ్ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కొట్నం, 11.52 గంటలకు మల్లన్న కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, 2.30 గంటలకు అగ్నిగుండాలు తొక్కడం, 3 గంటలకు సదర్‌పటం, సాయంత్రం 5 గంటలకు ఎల్లమ్మ బోనాలు, రాత్రి 9 గంటలకు మల్లన్న ఒగ్గు కథలు ఉంటాయన్నారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఒడి బియ్యం, అన్నదానంతో ఉత్సవాలు ముగుస్తాయని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

'కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు ఉపయోగకరం'

శంషాబాద్ రూరల్: కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు ఉపయోగకరంగా ఉందని ఓబీసీ మోర్చా రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ అనేగాని భాస్కర్‌గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ చరిత్రలో అద్భుతమైన బడ్జెట్‌గా పేర్కొన్నారు. అణగారిన వర్గాలను ఆదుకునేలా ఉందని, ఐటీ స్లాబుల విధానం వేతన జీవులకు ఊరట కలిగిస్తుందన్నారు.

ట్రిపుల్ ఐటీలో హ్యాకథాన్

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ–హైదరాబాద్, ప్రవాహ ఫౌండేషన్ సహకారంతో ప్రత్యేక పాన్ ఇండియా హ్యాకథాన్ నిర్వహించింది. ఈ హ్యాకథాన్ ప్రత్యేకంగా 10 నుంచి 17 ఏళ్ళ వయస్సు వారికి నిర్వహించారు. భారతదేశంలోని వివిధ నగరాల నుంచి మొత్తం 55 జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఈ హ్యాకథాన్‌లో 'సాంకేతికత ద్వారా సుస్థిరత' అంశంపై వాతావరణ మార్పు సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరిష్కారాలను రూపొందించడం, ఐక్యరాజ్యసమితి యొక్క స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు(ఎస్‌డీజీ)లు సాధించాలని నిర్ణయించారు. సమస్య పరిష్కార సామర్థ్యాలు, డిజైన్ సామర్థ్యం, ప్రదర్శన, వ్యవస్థాపక నైపుణ్యాలు, విద్యార్థులలో పర్యావరణ అవగాహనను అభివృద్ధి చేసింది. ఫైనల్స్‌లో విజేతలు, రన్నరప్‌లు మెమెంటోలు, రూ.25వేల వరకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లను అందుకున్నారు.

'అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళమెత్తుతా'


మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఒక ప్రజాప్రతినిధిగా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళమెత్తుతానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాలకు బయలుదేరుతున్న ఆయనను పలువురు మజ్లిస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఏ పార్టీ ఉన్నా మజ్లిస్ ప్రజల పక్షాన ఉండి వారి సమస్యలపై పోరాటం సాగిస్తుందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మంత్రులను ప్రశ్నించానన్నారు. ఈ సమావేశాల్లోనూ ప్రజల సమస్యలపై ప్రశ్నలు సంధిస్తానని ఆయన పేర్కొన్నారు. మజ్లిస్ నాయకులు జబ్బార్, అలీమొద్దీన్, మాజిద్ తదితరులు ఉన్నారు.

జీతాలు ఇవ్వాలంటూ ధర్నా

- గచ్చిబౌలి స్టేడియం ఎదుట సిబ్బంది నిరసన
- అధికారుల హామీతో విరమణ

గచ్చిబౌలి: మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా అంటూ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం ముందు సెక్యూరిటీ, ఇతర సిబ్బంది శుక్రవారం ధర్నా చేశారు. జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. స్టేడియంలో 47 మంది సెక్యూరిటీ సిబ్బంది, 25 మంది ఇతర విభాగాల సిబ్బంది ఉన్నారు. 3 నెలలుగా జీతాలురాక నానాఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. అధికారులు వచ్చి సోమవారం లేదా మంగళవారం జీతాలు ఇచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.



స్థానికులు సహకరిస్తేనే ఫ్లై ఓవర్ పొడిగింపు

- శంషాబాద్ జేఏసీ నేతలతో అధికారులు, ఎమ్మెల్యే సమావేశం
- సున్నితమైన సమస్యల పరిష్కారంతోనే ఫ్లై ఓవర్ పొడిగింపు సాధ్యమని వెల్లడి


జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలతో సమావేశమైన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, అధికారులు

శంషాబాద్: సున్నితమైన సమస్యలను పరిష్కరించుకుంటే ఫ్లై ఓవర్ పొడిగింపు సాధ్యమవుతుందని నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ అధికారులు తేల్చిచెప్పారు. బ్రిడ్జి బడావో.. శంషాబాద్ బచావో పేరిట శంషాబాద్ జేఏసీ నేతలు నాలుగు రోజులుగా రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని బేగంగార్డెన్‌లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సమక్షంలో నేషనల్ హైవే అథారిటీ ఎస్ఈ శ్రీనివాస్, ఆర్ అండ్ బీ ఈఈ ధర్మారెడ్డి, ఆర్‌డీఈఓ చంద్రకళ, శంషాబాద్ ఏసీపీ భాస్కర్ జేఏసీ నేతలతో చర్చించారు. ఫ్లై ఓవర్ పొడిగించాలంటే జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న రెండు వర్గాలకు చెందిన ప్రార్థనా మందిరాల్లోని కొంత స్థలం అవసరమవుతుందన్నారు. ఈ విషయంలో స్థానికులే సామరస్యంగా సమస్యను పరిష్కరించుకుని స్థల సేకరణకు సహకరిస్తే బ్రిడ్జి పొడవు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అండర్‌పాస్ ఏర్పాటుకు సైతం ఓ వైపు చెరువు, శ్మశానవాటికలు ఉడడంతో సాధ్యం కాలేదని చెప్పారు. బ్రిడ్జికి ఇరువైపులా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసేందుకు సైతం సమస్య ఉందన్నారు. ప్రజల విన్నపాన్ని ప్రభుత్వం అర్థం చేసుకుందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. సమస్య పరిష్కారం స్థానికుల చేతుల్లోనే ఉందని, దీనిపై సామరస్యంగా చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

సమస్యలను వివరించిన జేఏసీ

ప్రస్తుత డిజైన్ కారణంగా అనేక అనర్థాలు జరిగే అవకాశం ఉందని శంషాబాద్ జేఏసీ నేతలు అధికారులకు వివరించారు. ఇప్పటికే యాక్సిడెంట్ జోన్‌గా ఉన్న సిద్ధంతి ఫ్లై ఓవర్ ర్యాంపు కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. కూరగాయల మార్కెట్, శ్మశానవాటిక ఇతర పనులకు వెళ్లేందుకు ప్రజలు రోడ్డు దాటాల్సి ఉంటుందని చెప్పారు. సమావేశంలో శంషాబాద్ మాజీ సర్పంచ్ ఆర్.గణేష్‌గుప్తా, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, పీసీసీ కార్యదర్శి ఎం.వేణుగౌడ్, కౌన్సిలర్లు మేకల వెంకటేష్‌ముదిరాజ్ వివిధ పార్టీల నేతలు, జేఏసీ నేతలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేస్తున్నాం


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. శుక్రవారం జలమండలి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా చేపడుతున్న తాగునీటి పైపులైన్‌ల పనులు, జంక్షన్స్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. 1, 14 డివిజన్లలో ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాగు కనెక్షన్ లేని వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జలమండలి జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ మహేందర్‌నాయక్, డీఈ యాదయ్య, ఏఈ రాజీవ్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

సీబీఐటీలో స్పోర్ట్స్ డే


ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల వార్షిక సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా కొనసాగుతున్న శృతి–2023 ఉత్సవాల్లో రెండవ రోజు శుక్రవారం స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా రోజంతా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన క్రీడా దినోత్సవం ముగింపు ఉత్సవానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ కరాటే క్రీడాకారిణి అక్షర్ అభ్యుదయ్, గౌరవ అతిథిగా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కె.మనీషా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. లక్ష్యాన్ని సాధించటంలో అడ్డంకులు వచ్చినా శ్రమతో సాధించాలన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏసీపీని కలిసిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు


ఏసీపీని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు


ఏసీపీ రమణగౌడ్‌తో బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: నార్సింగి డివిజన్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన జీవీ రమణగౌడ్‌ను నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌యాదవ్ మాట్లాడుతూ.. గతంలో సీఐగా పని చేసిన సమయంలో అన్ని వర్గాల వారికి సమప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నేరాలను అరికట్టిన రమణగౌడ్ తిరిగి ఏసీపీగా రావడం అభినందనీయమన్నారు. ఏసీపీ రమణగౌడ్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కోకాపేట కౌన్సిలర్ విజయ్‌బాబు, దుర్గేష్‌యాదవ్, వినోద్‌కుమార్, కిరణ్ కుమార్, రాము, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నార్సింగి మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఆర్.నర్సింహ ఆధ్వర్యంలో నాయకులు హరిశంకర్, విష్ణువర్ధన్‌రెడ్డి ఏసీపీని కలిశారు.

కవ్వగూడ పర్యటనలో డిఫెన్స్ కళాశాల అధికారులు


కవ్వగూడలో పర్యటించిన నేషనల్ డిఫెన్స్ కళాశాల అధికారుల బృందం

శంషాబాద్ రూరల్: నేషనల్ డిఫెన్స్ కళాశాల అధికారుల బృందం శుక్రవారం కవ్వగూడలో పర్యటించింది. తెలంగాణ పర్యటనలో భాగంగా వారు గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యకలాపాలు, ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పల్లె ప్రకృతి వనం, ఇతర అభివృద్ధి పనుల అమలును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యం అవసరమని, ఇక్కడి కార్యక్రమాలు ఎంతో తృప్తి కలిగించాయని అధికారుల బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, డీఎల్‌పీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ వసంతలక్ష్మి, ఎంపీఓ ఉషాకిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శంషాబాద్ రూరల్: బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి కింద పడగా అది గమనించి రోడ్డుపై ఆగి ఉన్న మరో వ్యక్తిని బైక్ ఢీ కొట్టడంతో అతడికి గాయాలయ్యాయి. కొత్తూరు మండలానికి చెందిన కె.వినోద్(33) గురువారం రాత్రి బైక్‌పై షాద్‌నగర్ వైపు నుంచి శంషాబాద్ వస్తుండగా పెద్దషాపూర్ సమీపంలో బెంగళూరు జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి కింద పడడంతో గాయాలయ్యాయి. ఊటపల్లికి చెందిన రహమతుల్లా అటుగా వెళ్తూ ప్రమాదాన్ని గమనించి రోడ్డు పక్కన నిల్చున్నాడు. అదే సమయంలో మరో బైక్ వచ్చి రహమతుల్లాను ఢీకొనడంతో అతడు సైతం గాయపడ్డాడు. చికిత్స కోసం వారిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టీఎన్‌జీవోస్ కాలనీకి చెందిన హరిజన ఈదమ్మ(40)ను శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలైంది. స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూలో డిస్టెన్స్ డిప్లొమా కోర్సులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో దూరవిద్యా విధానంలో డిప్లొమా కోర్సులు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్ (సీడీవీఎల్) ద్వారా బ్లెండెడ్ మోడ్‌లో అందించే ఒక సంవత్సరం డిప్లమో కోర్సుల కోసం దరఖాస్తులు కోరుతున్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, సైబర్‌లాస్, ఫోరెన్సిక్ సైన్స్, లైబ్రెరీ ఆటోమేషన్ నెట్ వర్కింగ్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్, కమ్యూనిటీ ఐ హెల్త్, ఇతర నైపుణ్యాలలో గ్రాడ్యుయేట్‌ల ప్రయోజనానికి ఈ కోర్సులు నిర్వహిస్తున్నారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

యూత్ ఫెస్టివల్ విజేతలకు సత్కారం

రాయదుర్గం: విద్యార్థుల ప్రతిభ పెంపొందించేందుకు కృషి చేయాలని వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ కార్యాలయం ఆధ్వర్యంలో సౌత్, ఈస్ట్ జోన్ యూత్ ఫెస్టివల్ విజేతలకు శుక్రవారం సన్మానం చేశారు. భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా విశ్వవిద్యాలయంలో ఉత్సవాలు నిర్వహించారు. దీనిలో మనూ క్విజ్ జట్టు రెండవ బహుమతి గెలుచుకోగా, ఫొటోగ్రఫీ విభాగంలో ఐదవ బహుమతి వచ్చింది. క్విజ్ బృందంలో విద్యార్థులు అలియానిదా, మహ్మద్ నసీమ్, గుల్నాజ్‌పర్వీన్ ఉన్నారు. ఫొటోగ్రఫీలో డానిషరజాకు బహుమతి లభించగా, మైమ్ టీమ్‌లో మహ్మద్ ఫహీమ్, మహ్మద్‌నఫీస్ ఆలమ్, మహ్మద్ షాజాన్ హుస్నాపర్వీన్, ఆలమ్‌ఖాన్, అబ్రార్ అహ్మద్ ఉన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' ఏర్పాటు చేశారు. 'కాన్షియస్లీ క్రియేటింగ్ ఏ బ్యూటీఫుల్ వరల్డ్' అనే అంశంపై కెనడా హ్యాలీఫ్యాక్స్‌కు చెందిన డాక్టర్ డెబ్బికాస్టిల్, డాక్టర్ డేవిడ్‌ఫ్లెచర్ ఉపన్యాసం ఇస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమం ఉంటుంది. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలి.

వైభవంగా రంగనాథుడి రథోత్సవం

రాయదుర్గం: రంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రథోత్సవంను నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో రంగనాథస్వామి, మహాలక్ష్మీ మాత, ఆళ్వారు స్వాములకు పూజలు చేశారు. రథోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

లక్ష్మణ్‌బాగ్‌లో..

లక్ష్మణ్‌బాగ్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. అంతకు ముందు వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాయదుర్గం, పరిసర కాలనీల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభం


వాకింగ్ ట్రాక్ పనులను ప్రారంభించిన వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: పట్టణాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు వాకింగ్ చేసుకునేందుకు వాకింగ్ ట్రాక్‌లు నిర్మించాల్సిన అవసరం ఉందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు పంచవటి కాలనీలో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై వాకింగ్ చేస్తే ప్రమాదాలు జరుగుతాయనే భయంతో ప్రజలు బయటకు రావడం లేదన్నారు. వాకింగ్ ట్రాక్‌లు ఉంటే ప్రతిరోజూ కొంతసేపు వాకింగ్ చేసి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. పూల మొక్కలతో ట్రాక్‌ను అందంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆయన సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డి.సీతారాం, ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వివిధ సంఘాల నాయకులు

రాజేంద్రనగర్: పేదలకు వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కోశాధికారి జి.కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక సీఐటీయూ, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ, మహిళా సంఘాల నాయకులతో కలిసి రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇల్లు లేదా 60 గజాల ఇంటి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ క్లస్టర్ కన్వీనర్ జే.రుద్రకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.రామ్మోహన్, మండల కన్వీనర్ జి.ఎం.గట్టయ్య, ప్రజా సంఘాల ఐక్య వేదిక రాజేంద్రనగర్ మండల కన్వీనర్ జి.ఎం.కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

నవీన్ మిట్టల్‌ను కమిషనర్‌గా కొనసాగించాలి


కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

రాజేంద్రనగర్: ఇంటర్ పబ్లిక్ పరీక్షలు పూర్తయ్యే వరకు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు కమిషనర్‌గా నవీన్ మిట్టల్‌ను కొనసాగించాలని తెలంగాణ గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పరశురాములు కోరారు. శుక్రవారం రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, భూ పరిపాలన కమిషనర్(ఎఫ్ఏసీ)గా పదోన్నతిపై వెళ్లిన నవీన్ మిట్టల్‌కు అభినందనలు తెలిపారు. నవీన్ మిట్టల్ పారదర్శకంగా వ్యవహరిస్తూ ఇంటర్ విద్యలో పలు సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. ఈ–ఆఫీస్, బయోమెట్రిక్, గత 5 సంవత్సరాల్లో జరగని బోర్డు మీటింగ్ తీర్మాణంతో పరీక్ష పత్రాలను ఆన్‌లైన్ మూల్యాంకనం చేసేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఇంటర్ పరీక్షలు పూర్తయ్యే వరకు ఆయనను కొనసాగించాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఉందానగర్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయండి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

శంషాబాద్: ఉందానగర్ (శంషాబాద్) రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ జైన్‌కు బీజేపీ నేతలు వినతిపత్రం అందజేశారు. రైల్వేస్టేషన్‌కు అనుసంధానంగా రోడ్ కమ్ ఓవర్ బ్రిడ్జి, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలన్నారు. విమానాశ్రయంలో నిర్మించాల్సిన రైల్వేస్టేషన్ పనులను ప్రారంభించాలని, ఉందానగర్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని కోరారు. ఉందానగర్ పేరును శంషాబాద్‌గా మార్చాలని సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్‌గుప్తా, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'కనీస వేతనం రూ.24 వేలు చేయాలి'


ధర్నాలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి చలో హైదరాబాద్ కార్యక్రమానికి కార్మికులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.24 వేలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో పాటు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. విధి నిర్వహణలో కార్మికులు మరణిస్తే వారి కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. 60 సంవత్సరాలు దాటిన కార్మికులను విధుల నుంచి తొలగిస్తున్నారని, వారి స్థానంలో కుటుంబంలో వారు చెప్పిన వారికి ఉద్యోగం కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల పక్షాన తాము ముందుండి పోరాడతామన్నారు. కార్యక్రమంలో టి.ఆనంద్, సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే బంగారు భవిష్యత్ ఉంటుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని నేర్చుకోవాలని, ఎలాంటి డౌట్స్ ఉన్నా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు.


విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230